
# ఇంటింటికీ పథకాలు అందించాం



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకుడికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

- పథకాలు చూసే పార్టీలో చేరికలు
- జగిత్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, నవంబర్ 7: ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం అంతర్గాం, అనంతారం, గుర్రాజ్‌పల్లి గ్రామాలకు చెందిన వంద మంది యువకులు, మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా కృషి చేసి పార్టీని అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. రైతుబంధు దేశానికే ఆదర్శమని అన్నారు. అనంతరాం గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో రహదారుల శాఖ మంత్రిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి అనంతారం బ్రిడ్జి గురించి ఎందుకు పట్టించుకోలేదని విమర్శించారు. సమస్యను సీఎం దృష్టకి తీసుకెళ్లి హైలెవల్ బిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాల మకుందం, ఉప సర్పంచ్ బత్తిని మహేశ్, నాయకులు గాదె శ్రీనివాస్, చేని సురేందర్, నాగరాజు, బత్తిని తిరుపతి, అన్నవేని తిరుపతి, బొమ్మిడి వినిత్, గాదె మధు పాల్గొన్నారు.

అంతర్గాం గ్రామంలోని ఒడ్డెరకాలనీకి చెందిన అల్లెపు గంగారాం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన గంగిపెల్లి రవి నానమ్మ గంగిపెల్లి బుచ్చి రాజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన

జగిత్యాల, నవంబర్ 7: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ప్రతి వయోవృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోవాలని, 80 ఏళ్లు పైబడిన వయోవృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించారని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పారు. మంగళవారం 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు సమర్పణకు చివరి రోజు కావడంతో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్ కేంద్రాల్లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు ఇంటింటా తిరిగారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు సమర్పణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పుప్పాల హన్మంత్ రెడ్డి, ఎండీ యాకుబ్, కోశాధికారి వీ ప్రకాశ్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొయ్యడ సత్యనారాయణ, పీ అశోక్‌రావు, సంయుక్త కార్యదర్శులు బొబ్బాటి కరుణ, రాజ్ గోపాల్ చారి, దేవేందర్ రావు, నారాయణ, జగిత్యాల పట్టణాధ్యక్షుడు పీ సతీశ్ రాజ్, నాయకులు మానాల కిషన్, ఎండీఇక్బాల్, ఎండీ యాకుబ్ హుస్సేన్, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి రాజ్‌మోహన్, సైఫొద్దీన్, లక్ష్మీ నారాయణ, మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జల బుచ్చిరెడ్డి, కార్యదర్శి సౌడాల కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసులకు ఉలెన్ కోట్స్ పంపిణీ



ఉలన్ కోట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ

జగిత్యాల, నవంబర్ 7: జిల్లా పోలీసులకు మంజూరైన నూతన ఉలెన్ కోట్స్‌ను ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో పోలీసులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి ఉలెన్ కోట్స్‌ను తెప్పించి సిబ్బందికి పంపిణీ చేశామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. జిల్లా పోలీస్ సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, అడ్మిన్ ఆర్‌ఐ జానీమియా, ఆర్‌ఎస్‌ఐ వినోద్ రెడ్డి పాల్గొన్నారు

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతంత

- బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్
- ఘనంగా సుహాసిని పూజ



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ సంజయ్‌కుమార్ దంపతులు

జగిత్యాల టౌన్, నవంబరు 7: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతంత కలుగుతుందని జగిత్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శత చండీ యాగంలో భాగంగా మంగళవారం మాతలతో సుహాసిని పూజ (కుంకుమ పూజ) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న శత చండీ యాగానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారన్నారు. అనంతరం డాక్టర్ సంజయ్‌కుమార్ దంపతులను యాగం నిర్వాహకుడు తిగుళ్ల విషు శర్మ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక, వేల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



కుంకుమ పూజలకు హాజరైన మహిళలు



వృద్ధురాలిని కారు గుర్తుకు ఓటు వేయ్యాలని కోరుతున్న వసంత, రాధిక

## అభివృద్ధి, సంక్షేమానికే జై కొట్టాలి

- జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సతీమణి రాధిక
- అంబారిపేట గ్రామంలో ఎన్నికల ప్రచారం


జగిత్యాల రూరల్, నవంబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు జై కొట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సతీమణి రాధిక అన్నారు. మంగళవారం జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట గ్రామంలో వారు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, పార్టీ మండలాధ్యక్షుడు సురేందర్ రావు, జడ్పీటీసీ మహేశ్, ఎంపీటీసీ మల్లారెడ్డి, రూరల్ మండలాధ్యక్షుడు చెరుకు జాన్, సర్పంచులు స్వప్న -రాజేందర్ రెడ్డి, తిరుపతి, ఉప సర్పంచ్ మల్లేశం, మండల యూత్ అధ్యక్షుడు శేఖర్, గ్రామ యూత్ అధ్యక్షుడు తిరుపతి గౌడ్, మహిళలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రచార జోరు



రాయికల్: పట్టణంలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

రాయికల్, నవంబర్ 7: పట్టణంతోపాటు గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ కుమార్‌కు మద్దతుగా మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో, గ్రామాల్లో కౌన్సిలర్లు, నాయకులు ప్రభుత్వ పథకాలు, మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి డాక్టర్ సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కోనాపూర్‌లో సమావేశమైన గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

సారంగాపూర్, నవంబర్ 7: కోనాపూర్ గ్రామంలో నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు భారీ మెజార్టీ వచ్చేలా ప్రతి కార్యకర్త తమవంతు కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తోడేటి శేఖర్ గౌడ్ పేర్కొన్నారు. అలాగే సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.